# ఉక్రెయిన్, రష్యా, ఇజ్రాయిల్ తదితర దేశాలకు నిరుద్యోగుల వలసలు- పాలకుల విధానాలు

భద్రం

**దేశంలో** ఉద్యోగం దొరుకుతుందని ఆశ యువతలో సన్నగిల్లింది. నిరుద్యోగ సమస్య పట్ల ప్రభుత్వ, పాలకుల ఉద్దేశపూరిత నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితులు... ప్రాణాలకు తెగించి చట్టవిరుద్ధంగానైనా సరే, వలస వెళ్లేందుకు మన దేశ యువతను ప్రేరేపిస్తున్నాయి. మన దేశ నిరుద్యోగ యువత విదేశాలకు వెళ్లేందుకు, యుద్ధభూమిలో ప్రాణాలు కోల్పోయేందుకో, లేక అంగవైకల్యం పాలయ్యేందుకో కూడా వెనుకాడక, తెగిస్తున్నారనే దాని వెనుకనున్న నేపథ్యాన్ని పరిశీలించాలి.

ప్రస్తుతం 18వ లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. గత రెండు దశాబ్దాల కాలంగా మోడీ నాయకత్వంలో దేశాన్ని ఏలుతున్న బిజెపి, తిరిగి మరోసారి అధికారంలోకి రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

గత కొద్ది నెలలుగా మోడీ, మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వము... రానున్న మూడేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్లకు చేర్చడం ద్వారా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందిస్తామని, 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్ల స్థాయికి భారత ఆర్థిక వ్యవస్థ చేరుకుంటుందని ఎడతెగకుండా బడాయి ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విధంగా భారత ఆర్థిక వ్యవస్థకు చెందిన ఒక అందమైన రూపాన్ని చిత్రించి, ఈ పరిస్థితి కొనసాగాలంటే మూడవ పర్యాయం కూడా నరేంద్ర మోడీని అధికారంలోకి తేవాలనిచెబుతున్నారు. పైగా, ప్రభుత్వ ఏజెన్సీల తప్పుడు నివేదికల ద్వారా నిరుద్యోగ సమస్య దిగి వచ్చినట్టుగా, దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజానీకపు సంఖ్య గణనీయంగా తగ్గినట్టుగా చిత్రిస్తున్నారు. ఈ రకమైన తప్పుడు పద్ధతులలో ప్రజలను, ఓటర్లను మోసగించి, వారి ఓట్లను కొల్లగొట్టి, మరోసారి తిరిగి అధికార పీఠానికి ఎగబాకాలని చూస్తున్నారు.

ఏమైనా దేశంలోని అత్యధిక ప్రజల సంక్షేమం విషయంలో వాస్తవిక పరిస్థితి మాత్రం కఠోరంగా, నిరాశాజనకంగా ఉంది. 'బహుత్వ కర్ణాటక' అనే పౌరుల, ప్రజా సంస్థలకు సంబంధించిన వేదిక 'భారతదేశంలో నిరుద్యోగం, వేతనాలు, అసమానత్వం' మొదలైన అంశాలను విశ్లేషిస్తూ మార్చి 11న ఒక నివేదిక అందించింది. ఎన్డీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి, ఉద్యోగ కల్పనతో సహా, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, వేతనాలలో పెరుగుదలలను ఈ నివేదిక విశ్లేషించింది. 2019 ఏప్రిల్‌లో ప్రధాని మోడీ, 2.5 కోట్ల ఉద్యోగాలు ప్రతి సంవత్సరం జోడించబడుతున్నాయని ప్రకటన చేసినప్పటికీ, సామాజిక భద్రత, దానితో ముడిపడిన ఇతర సౌకర్యాలతో కూడిన లాంఛనప్రాయ ఉద్యోగిత, ఎదుగు బొదుగు లేకుండా నిలిచిపోయి ఉందని... ఈ నివేదిక అందజేసిన గణాంకాలు తెలుపుతున్నాయి.

మరోవైపున విడివిడిగా, స్వయం ఉపాధి పొందుతున్న వారుగా చెప్పబడుతున్న వారి సంఖ్య నిలకడగా పెరుగుతోంది. కుటుంబాలు స్వయంగా నిర్వహించుకునే కిరాణా దుకాణాలు మొదలైన వాటిల్లో సహాయకుల సంఖ్య, చెల్లింపులు లేని కుటుంబ శ్రామికుల సంఖ్య పెరగటం రూపంలో ఇది మనకు వ్యక్తం అవుతోంది. మరోవైపున రోడ్డు మలుపులో చిన్న బంకులు, టీ దుకాణం లేదా తోపుడుబండ్ల వంటి వాటిపై తినుబండారాలు అమ్ముకోవడం మొదలైన రూపాలలో స్వీయ శ్రమ చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వారి పనిలో నాణ్యత కొరవడుతోంది. అనియత రంగంలో ఉపాధి పొందుతున్న వారిలో అధిక సంఖ్యాకులుగా ఉంటూన్న వీరి ఉపాధి, అనిశ్చిత స్వభావం కలిగినదిగా ఉంది.

నూతన ఉద్యోగ కల్పన నిలిచిపోయింది. నిరుద్యోగం, ఉద్యోగరాహిత్యం ప్రతి సంవత్సరం పెరిగిపోతూ యువతను నిరాశ నిస్పృహలకు లోను చేస్తోంది. నిరుద్యోగం, ఉద్యోగరాహిత్యం, అత్యధికులకు అవసరమైన లాభదాయకమైన ఉద్యోగాలు కల్పించడంలో పాలకుల, పాలకవర్గాల పట్టనితనం, వ్యవసాయ సంక్షోభం మున్నెన్నటి కంటే పెరగటం, గ్రామీణ ప్రాంత దుస్థితి మొదలైన కారణాలతో... చదువుకున్న వారితో సహా, నిరుద్యోగ యువత, తమ ప్రాణాలకు ప్రమాదకరమైనప్పటికీ, చట్టవిరుద్ధంగా అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలకే కాదు, ఎక్కడికైనా సరే వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దుర్భరంగా ఉన్న తమ జీవితాలను ఏమేరకైనా మెరుగుపరుచుకునేందుకు ఈ పరిస్థితులు వారిని తెగించటానికి ప్రేరేపిస్తూ బలవంత పెడుతున్నాయి.

భారతదేశంలోని 18-29 సంవత్సరాల వయస్సు నడుమనున్న నిరుద్యోగ యువత యొక్క భయంకరమైన దుస్థితి, నిరాశా నిస్పృహలను ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. నిరుద్యోగులైన యువత చట్టవిరుద్ధంగా అమెరికా, లండన్ మరియు ఇతర దేశాలకు ప్రాణాలకు తెగించి ఏదో విధంగా వెళ్లడానికైనా సిద్ధమయ్యారని ఈ ఘటనలు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ... ప్రభుత్వం లాభదాయకమైన ఉద్యోగితను, ఉద్యోగాలను సృష్టించాల్సిన తక్షణ అవసరాన్ని ఒకవైపున నొక్కి చెప్తున్నాయి. మరోవైపున, మనదేశంలో ఉద్యోగ అవకాశాలు మసకబారుతున్న నగ్నస్థితిని వెల్లడి చేస్తున్నాయి.

అందుబాటులో నున్న సమాచారం ప్రకారం... అమెరికాకు చట్ట విరుద్ధంగా వెళ్లిన భారతీయుల సంఖ్య, ఇటీవల కాలంలో బాగా పెరుగుతోంది. 2023లో ఈ సంఖ్య లక్షకు చేరువగా ఉంది. అదేవిధంగా, ఉద్యోగ ఉపాధుల వెతుకులాటలో ఆశ్రయం కోరుతూ ఇంగ్లాండ్‌కు చట్ట విరుద్ధంగా వెళ్లిన వారి సంఖ్య, గత సంవత్సరం కంటే రెట్టింపు అయింది. ఇండియా నుండి వెళ్లిన 18–29 వయస్సు మధ్యనున్న చట్టవిరుద్ధ వలస కార్మికుల, ఉద్యోగుల సంఖ్య... 2023లో చట్టవిరుద్ధంగా మన దేశం నుండి వెళ్లిన మొత్తం వలస కార్మికుల సంఖ్యలో 60 శాతానికి దగ్గరగా ఉంది.

ఇటీవల మైనర్ పిల్లలతో సహా 303 మంది భారతీయులను, ఫ్రెంచ్ విమానాశ్రయంలో అధికారులు నిర్బంధంలోకి తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన దేశంలోని నిరుద్యోగుల, ఉపాధిహీనుల దుస్థితికి తార్కాణంగా, వారి నిరాశా నిస్పృహల గురించి అనంతంగా చెబుతోంది. ఈ విధంగా విమానాశ్రయంలో నిలిపివేయబడిన వారిలో అత్యధికులు పంజాబ్, హర్యానా, గుజరాత్‌లకు చెందిన వారు ఉండడాన్ని ప్రత్యేకించి గమనించాలి. నిర్బంధంలోకి తీసుకోబడిన వారు పేర్కొన్న వివరాల ప్రకారం... వ్యవసాయ రంగంలో నెలకొన్న దుస్థితి, సంక్షోభం తీవ్రమవుతున్న పరిస్థితి, అత్యల్ప ఆదాయాలతో అత్యధిక దోపిడీకి గురవుతూ సాగుభూమి విచ్ఛిన్నమవుతున్న పరిస్థితులలో వారంతా ప్రాణాలకు తెగించి, అపాయకరమని తెలిసి కూడా, చట్టబద్ధ వలస కార్మికులుగా గుర్తించ బడటానికి అంతులేని కష్టాలను అనుభవించామని చెప్పారు. మానవ అక్రమ రవాణాదారులు, వారి ఏజెంట్లు అసాధారణ లాభాలను ఆర్జించేందుకు, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని దోపిడీ చేస్తారనే దాంట్లో సందేహం లేదు. నిరుద్యోగ యువతకు వారు తప్పుడు వాగ్దానాలు, ఉద్యోగాల గురించి గేలం వేసి తప్పుడు ప్రతిపాదనలతో వారిని లోబరుచుకుంటున్నారు. ప్రభుత్వం, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా, నిరుద్యోగ యువత దుస్థితి పట్ల పట్టనితనంతో ఉండడం... మానవ అక్రమ రవాణాదారులకు మంచి అనుకూలంగా ఉండి, వారి పనిని సులభతరం చేసింది.

మానవ అక్రమ రవాణాదారులను, వారి ఏజెంట్లను నిందించడానికి ప్రభుత్వం, పాలకులు పరిమితమవుతున్నారు. తమ తప్పిదమేమీ లేదని చేతులు దులిపేసుకుంటున్నారు. కానీ, నిరుద్యోగ యువత తమ జీవితాలను, ప్రాణాలను పణంగా పెట్టి అక్రమ చొరబాటుదారులుగా మారటానికి సిద్ధమవుతున్న వారి నిరాశ నిస్పృహలకు కారణమైన తమ బాధ్యత నుండి తప్పుకుంటున్నారు.

అలాగే నిరుద్యోగులైన యువతకు ఆశలు కల్పించి, సహాయకుల పేరుతో ఉక్రెయిన్‌లోని రష్యా యుద్ధభూమి ప్రాంతానికి పంపి, వారిచే నిర్బంధంగా యుద్ధంలో పాల్గొనేటట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో యుద్ధంలో మరణించడం లేదా కాలు చేయి కోల్పోయి అంగవికలురుగా మిగిలేందుకు కూడా సిద్ధమవుతున్నారు. యూట్యూబ్ ఛానల్స్ కొన్ని నిరుద్యోగ యువతను ప్రలోభ పరచి, రష్యాలో గౌరవప్రదమైన జీవితం గురించి వాగ్దానం చేస్తున్నాయని ఇప్పుడు ప్రభుత్వం వాదన చేస్తోంది. ఈ విధమైన తప్పుడు ప్రకటనల వలలో చిక్కి ఎంతోమంది మనదేశ యువత రష్యా చేరుకొని, అక్కడ యుద్ధ ప్రాంతంలో ప్రాణాలను కోల్పోయారు. తమను కాపాడి, రక్షణ కల్పించాల్సిందిగా భారత రాయబార కార్యాలయానికి నిస్సహాయులైన ఈ బాధితులు చేసుకున్న విజ్ఞప్తులన్నీ నిష్ప్రయోజనంగా మిగిలిపోయాయి. ఈ కార్మికుల పాస్ పోర్టులు వారి ఇతర అర్హత పత్రాలన్నీ ఈ సైనిక అధికారుల అధీనంలో ఉండిపోయాయి. ఈ కార్మికులతో ఒప్పందం చేసుకున్న ఈ సైనిక అధికారులు, వారికి స్వేచ్ఛనివ్వటానికి అంగీకరించకపోగా, యుద్ధ ప్రాంతంలో నిర్బంధంగా వారిచే పని చేయిస్తున్నారు. నిరుద్యోగ యువత పట్ల పాలకుల, ప్రభుత్వాల నిర్లక్ష్యపూరిత, బాధ్యతారహిత వైఖరి, దేశంలో ఉద్యోగాలు కల్పించని పరిస్థితులనేవి... ఈ నిరుద్యోగ యువత దుస్థితి వెనకనున్న వాస్తవికమైన కారణాలు. అందుచేతనే వారంతా తమ ప్రాణాలకు తెగించి జీవనాధారం కోసం అక్కడిదాకా వెళ్లడానికైనా సిద్ధమవుతున్నారు.

మరోవైపున మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం, మన దేశం నుండి 42 వేల మంది కార్మికులు ఇజ్రాయిల్ వలస వెళ్లేందుకు ఏ విధంగా తోడ్పడిందో, ప్రభుత్వమే ఒక మానవ అక్రమ రవాణాదారునిగా, అధికారిక ఏజెంట్‌గా ఏ విధంగా వ్యవహరించిందో... చూస్తున్నాం. ఇటీవల కాలంలో పాలస్తీనా పై ఇజ్రాయిల్ సైనిక దాడులు సాగిస్తున్న క్రమంలో, ఇజ్రాయిల్ ప్రభుత్వం, తమ దేశంలోని వేలాదిమంది పాలస్తీనా కార్మికుల పని అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసింది. కావున, వీరి స్థానంలో ప్రత్యామ్నాయంగా పనిచేసేందుకు భారతదేశ కార్మికులను అక్కడికి పంపడం జరుగుతోంది.

ఇజ్రాయిల్ ప్రభుత్వం, పాలస్తీనాపై అమానవీయ దురాక్రమణ యుద్ధాన్ని సాగిస్తూ, జాతి నిర్మూలన గావించే తన విధానంతో మారణకాండ సాగిస్తోంది. కాగా, భారత ప్రభుత్వం... యుపి, హర్యానాలలో ప్రభుత్వ కార్మిక శాఖల ద్వారా, యుద్ధ ప్రభావిత ప్రాంతాలలో పనిచేసేందుకు, కార్మికులను పనిలోకి తీసుకుంటున్నట్లుగా ప్రచారం చేయవలసిందిగా మాధ్యమాలను ప్రోత్సహించి, ప్రభుత్వమే ఇజ్రాయిల్‌కు కార్మికులను పంపేందుకు నియామకాలను నిర్వహించింది. దీనికి అర్హత పొందటానికి అభ్యర్థులు కొన్ని షరతులను పాటించాలి. 1. గతంలో ఇజ్రాయిల్‌లో వీరు ఉద్యోగం చేసి ఉండకూడదు. 2. వీరి కుటుంబంలో ఎవరైనా ఇప్పుడు ఇజ్రాయిల్‌లో నివసించడం కానీ లేదా ఇజ్రాయిల్‌లో ఉద్యోగం చేస్తూ కానీ ఉండకూడదు. పైగా ఎంపిక చేయబడిన అభ్యర్థులు విదేశాలు వెళ్లడానికి ముందుగా వైద్య పరీక్షల కోసం

5,500రూ. చెల్లించాలి. అలాగే విమాన టికెట్ల ఖర్చుల కోసం 25 వేల రూపాయలు చెల్లించాలి. అంతేగాక, ఎన్‌ఎస్‌డిసికి ప్రాసెసింగ్ ఫీజు కింద ఎంపికైన ప్రతి అభ్యర్థి పదివేల రూపాయలు చెల్లించాలి.

ఈ విధంగా ప్రభుత్వం...'లబ్ధి చేకూర్చే' ఉద్యోగ కల్పనాదారునిగా నిస్సిగ్గుగా తనను తాను ప్రదర్శించుకుంటోంది. మరోవైపున ఇజ్రాయిల్‌కు ఈ కార్మికులను పంపడం ద్వారా, ఈ కార్మికులకు ఆ దేశంలో వచ్చే ఆదాయంతో భారతదేశ లబ్ధి పొందనుంది. భారతదేశానికి అవసరమైన, చెల్లింపుల సమతుల్యతలో కీలకమైన విదేశీ మారక ద్రవ్యం వీరి ద్వారా దేశానికి లభ్యమవుతోంది. నిరుద్యోగ సమస్య తీవ్రత, కార్మికులను ఎలాంటి అపాయకరమైన పనులు చేయడానికైనా నెడుతోంది. ఇజ్రాయిల్‌లో పనిచేయడం ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడమేనని, ఇజ్రాయిల్‌కు బయటనున్న కార్మికులు చెప్తున్న ప్రకారం.... తరచుగా వారితో యజమానులు దౌర్జన్యకరంగా వ్యవహరిస్తారని, ఆరోగ్య సమస్యలలో మనదేశంలో కంటే మూడు రెట్లు అధికంగా ఖర్చు అవుతుందని... అనేక మంది హెచ్చరిస్తున్నారు. అయితే, నిరాశా నిస్పృహలతో, ఉద్యోగపు వెదుకులాటలో ఉన్న అభ్యర్థులు మాట్లాడుతూ "మాలాంటివారు సమాజంతో యుద్ధంలోనే ఉన్నాము... ఆంతరంగికంగా మా మనసులతో ఆజన్మాంతం యుద్ధంలో ఉన్నాము..." అంటున్నారు. కనుక ఇజ్రాయిల్‌లో యుద్ధ పరిస్థితులలో ప్రాణాలకు తెగించి అయినా, ఉద్యోగాలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. దేశ నిరుద్యోగ ప్రజానీకపు నిరాశనిస్పృహల వాస్తవిక పరిస్థితి ఇది. ఏటా 2.5 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తానన్న మోడీ ప్రకటనలోని మోసకారితనాన్ని ఇది వెల్లడి చేస్తోంది. ఈ బలీయమైన అంశాన్ని చేగొని పోరాటం సాగించడంలో కార్మికోద్యమ వైఫల్యం కూడా, మనదేశంలో కొనసాగుతున్న వాస్తవిక కఠోర పరిస్థితిని ప్రతిఫలిస్తోంది.

**(2024 ఏప్రిల్ 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)**

★★★★★